క్లుప్తంగా

వర్షంతో ఉపశమనం


నాయుడుపాలెంలో కురుస్తున్న వర్షం

పరవాడ: మండలంలో గురువారం మధ్యాహ్నం 4 గంటలకు కురిసిన భారీ గాలి వర్షంతో గెడ్డలు, కాలువలు పొంగి ప్రవహించాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉపశమనం పొందుతున్నారు. అదేవిధంగా ప్రస్తుత వర్షాలు జీడి తోటలు, పశుగ్రాసం మొలకెత్తడానికి దోహదపడతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అప్పన్నను దర్శించుకున్న గిరిజన పూజారులు


సింహగిరిపై గిరిజన పూజారులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం అల్లూరి సీతారామారాజు జిల్లాలోని పలువురు గిరిజన పూజారులు దర్శించుకున్నారు. ఆ జిల్లాలోని పలు గ్రామా ల్లో విశ్వ హిందూ పరిషత్ ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి ఆలయాల్లో వీరంతా పూజారులుగా ఉన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని టీటీడీ నిర్మిస్తున్న 163 ఆలయాల్లో కూడా వీరంతా పూజారులుగా విధులు నిర్వహించనున్నారు. ఈ తరుణంలోనే గురువారం భీమిలిలో జరిగిన ఒక సమావేశానికి వచ్చిన వీరంతా తొలుత సింహాచలంలో స్వామివారిని దర్శించుకున్నారు. సింహాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అల్లూరి జిల్లాలోని ఆలయాల నిర్మాణాల పర్యవేక్షకుడు రాంబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురళి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మండల కేంద్రానికి చేరిన పది పరీక్షా పేపర్లు


పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పదోతరగతి సెట్-2 పరీక్షా పేపర్ల

సబ్బవరం: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏప్రిల్‌లో నిర్వహించే పరీక్షలకు సంబంధించిన సెట్–2 పరీక్షా పేపర్లు గురువారం సబ్బవరం మండలానికి చేరుకొన్నాయి. పరీక్షా పేపర్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో పరిశీలించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. సబ్బవరం మండలంలోని 5 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే పరీక్షలకు 1040 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఎంఈవో ఎస్. అప్పలరాజు చెప్పారు.

ఘనంగా భావనారుషి భద్రావతి పూజలు


గాంధీనగర్‌లో భవనారుషి-భద్రావతికి పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు ఆరిలోవ ప్రాంతం గాంధీనగర్‌లో భక్తమార్కెండేయ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం పద్మశాలి కులదైవం భావనారుషి భద్రావతి సమేత పూజలు ఘనంగా నిర్వహించారు. సంఘం సభ్యులు తమ కుటుంబాలతో కలసి ఉదయం ఇక్కడ పూజలు, రుద్రాభిషేకం చేశారు. అనంతరం భావనారుషి భద్రావతి చిత్ర పటాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తి కీర్తనలతో కాలనీలో సందడి చేశారు. సాయంత్రం ఇక్కడ ప్రాంగణంలో భజనలు చేశారు.

నేడు సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శన

మద్దిలపాలెం : విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలవారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించనున్నామని అసోసియేషన్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ కల్చరల్ విభాగం జోన్ కన్వీనర్ వంకాయల మారుతీ ప్రసాద్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, డిప్యూటీ మేయర్ శ్రీధర్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు హాజరుకానున్నారు.

కొలువుదీరిన దుర్గమాంబ


దుర్గమాంబను ఆలయంలో ప్రతిష్టించడానికి ఊరేగింపుగా తీసుకువెళుతున్న దృశ్యం


దుర్గమాంబకు సమర్పించేందుకు తీసుకొచ్చిన సారె


అమ్మవారి సన్నిధిలో గ్రామ పెద్దలు

పరవాడ: ఈ.బోనంగి శివారు బొద్దపువానిపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ దుర్గమాంబ విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవ మహోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయాన్ని పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం శ్రీదుర్గమాంబను భక్తుల దర్శనార్థం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వేదపండితులు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నడుమ రేవతి నక్షత్రయుక్త, వృషభ లగ్నమందు ఉదయం 9.57 గంటలకు విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ దేవతకు భక్తులు పసుపు కుంకుమలు, సారే, చీరలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా చిడతలు, తప్పెడుగుళ్ల, సాముగరిడిలు, నేల డ్యాన్సులు నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచాను కాల్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

దుర్గమాంబను దర్శించుకొన్న నాయకులు

గ్రామంలో కొలువుదీరిన శ్రీ దుర్గమాంబను ఈ.బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ప్రముఖులు చుక్క రామునాయుడు, పైల జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, బొద్దపు నూకరత్నం, బొద్దపు వెంకటరమణ, బొద్దపు చిన్నారావు, మేడిశెట్టి బాలాజీ నాయుడు, పలువురు గ్రామ పెద్దలు అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రహదారి భద్రతపై అవగాహన అవసరం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ ఈశ్వరరావు

పరవాడ: రహదారి భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవలసిన అవసరం ఉందని పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు అన్నారు. జేఎన్ ఫార్మాసిటీలో విష్ణు కెమికల్, సువెన్ ఫార్మా పరిశ్రమల్లో గురువారం నిర్వహించిన రహదారి భద్రత అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. వాహనాలపై రాకపోకలు సాగించే సమయంలో రహదారి భద్రత చర్యలను పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి బయటపడవచ్చునన్నారు. కార్లలో ప్రయాణించే సమయంలో సీటు బెల్ట్ ధరించాలన్నారు. వాహనచోదకులు విధిగా హెల్మెట్‌ను ధరించడం ద్వారా ప్రమాదాల నుంచి బయటపడొచ్చన్నారు. రహదారి భద్రతలో ఉద్యోగులు, కార్మికులు, వాహనచోదకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఐ ఈశ్వరరావు సూచించారు.

భగత్‌సింగ్ రచనలు స్ఫూర్తిదాయకం


భగత్‌సింగ్ చిత్రపటానికి పూలలు వేసి నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: భగత్‌సింగ్ రచనలు నేటి యువతకు మార్గదర్శకాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. పరవాడ సినిమాహాలు కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ భగత్‌సింగ్ ప్రతి భారతీయుడి గుండెల్లో చెరగని ముద్ర వేసుకొన్నారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్ చూపిన తెగువ, సైద్ధాంతిక పటుత్వం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.నాయుడు, సీహెచ్.వెంకునాయుడు, బి.శ్రీను, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల ప్రజా పరిషత్ సమావేశం

సింహాచలం : పెందుర్తి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వెంకటరావు తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు మండల ప్రజా కార్యాలయంలో ఈసమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే సభ్యులందరికీ సమాచారం అందజేశారు.

సిద్ధార్థ రెడ్డికి సత్కారం


బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని సత్కరిస్తున్న అనకాపల్లి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సురేష్ తదితరులు

సబ్బవరం: వైఎస్సార్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని అనకాపల్లి జిల్లా పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. తాడేపల్లిలో జరిగిన జిల్లా యువజన విభాగాల అధ్యక్షుల సమావేశం అనంతరం సిద్ధార్థ రెడ్డిని సురేష్‌రాజ్ సత్కరించారు. ఆయనతోపాటు జిల్లాకు చెందిన యువజన విభాగం కార్యదర్శి ఉగ్గిన గంగునాయుడు, నాయకులు జి.రాజేష్, యడ్ల నాయుడు, లగిశెట్టి కుమార్, బోకం బాలు, జెట్టి హేమంత్ కుమార్ తదితరులు ఉన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడికి సాయం అందజేస్తున్న సాయినాథరావు తదితరులు

సబ్బవరం: మండలంలోని అప్పయ్యపాలెం గ్రామానికి చెందిన ఉప్పులి లక్ష్మణరావుకు రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితం కావడంతో యాదవ నాయకులతో పాటు గ్రామంలోని యువకుల సహాయంతో రూ.70 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ మొత్తాన్ని అనకాపల్లి జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు బర్నికాన సాయినాథరావు సబ్బవరంలోని శ్రీకృష్ణ మందిరం వద్ద గురువారం బాధితుడు ఉప్పుల లక్ష్మణరావుకి అందజేశారు. లక్ష్మణరావు సుమారు 6 నెలలుగా మంచానికే పరిమితకావడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామ పెద్దలు ఉప్పిలి అప్పలరాజు బర్నికాన సాయినాథరావు దృష్టికి తీసుకోని వెళ్లారు. దీంతో ఈసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి పల్ల తాతారావు, పల్ల కృష్ణ, ఈపు అప్పలరాజు, పల్ల సన్యాసిరావు, పల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా స్వర్ణపుష్పార్చన


గరుడసేవ నిర్వహిస్తున్న పురోహిత్ అలంకారి సీతారామాచార్యులు, పాల్గొన్న భక్తులు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న ఉప ప్రధానార్చకుడు, ఉద్యోగులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళిని నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు శ్రీకాంత్ తదితరులు ఈసేవను నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


నిత్యకల్యాణంలో యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి 10.30గంటల వరకు శ్రీ వరాహ నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమంపడంలోని వేదికపై వేంజేంప జేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు ,ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేంజేంపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజను నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ ఈపూజలో పాల్గొన్నారు.

రామజోగిపేట ఘటన దురదృష్టకరం


మృతి చెందిన బాలలను పరిశీలిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్, గొండు సీతారామ్


వార్డులో చికిత్స పొందుతున్న వారిని పరిశీలిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్, సీతారామ్

మహారాణిపేట : నగరంలోని రామజోగిపేటలో గురువారం తెల్లవారు జామున భవనం కూలి మృతి చెందిన ఎస్.అంజలి (15), ఎస్.దుర్గాప్రసాద్ (17) మృతదేహాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ గురువారం కేజీహెచ్ మార్చురీకి వెళ్లి పరిశీలించారు. అనంతరం సంతాపం వ్యక్తం చేశారు. సీతారామ్‌తో పాటు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఏఆర్ఎంవో డాక్టర్ జగదీష్ తదితరులు కూడా మృతదేహాలను పరిశీలించారు. శవ పరీక్షలు నిర్వహించి బంధువులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సీతారామ్ ఆదేశించారు. ఇదే ప్రమాదంలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న తల్లిదండ్రులను క్యాజువాలిటీకి వెళ్లి పరామర్శించారు. ఇద్దరు పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు భగవంతుడు మానసిక స్థైర్యం కల్పించాలని సీతారాం అన్నారు. సందర్శించిన వారిలో ఏఆర్ఎంవో కేవీ అరుణాదేవి, ఆస్పత్రి వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధులు జి.శరణ్య, మాలతి, డాక్టర్ జగ్గారావు, కె.ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

క్షతగాత్రులకు యువసేన సాయం

రామజోగిపేటలో మూడంతస్తుల భవనం కూలిన ఘటనలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని యువసేన ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు పీలా హరిప్రసాద్ గురువారం పరామర్శించారు. తీవ్ర గాయాలపాలైన రామారావు, కళ్యాణిలకు రక్తం సరఫరా చేసే విషయంలో హరిప్రసాద్ చొరవ చూపించారు. అలాగే సంఘటనా స్థలానికి చేరుకుని మంచినీళ్ల బాటిళ్లు, ఆహారం సరఫరా చేశారు. సహాయక బృందాలకు అల్పాహారం అందజేశారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లీనరీ రీసెర్చ్ హబ్(ఏయూ టీడీఆర్ హబ్) ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాన్ని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏయూ టీడీఆర్ హబ్‌లో ప్రవేశం పొంది 18 నెలల కాలం ముగిసిన వారికి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలను నిర్వహిస్తున్నట్టు హబ్ డైరెక్టర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలిపారు. పరీక్షలు పటిష్టంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంపై రెక్టార్ సంతృప్తి వ్యక్తం చేశారు.

దళిత యువకుడి హత్య బాధాకరం

సబ్బవరం: కాకినాడ జిల్లాలోని తొండంగి మండలంలో దళిత యువకుడ్ని హత్య చేసిన నిందితులపై తక్షణం చర్యలు చేపట్టాలని మండల మాదిగ పోరాట సమితి గౌరవాధ్యక్షుడు దువ్వి దుర్గాలు డిమాండ్ చేశారు. గ్రామంలో జరుగుతున్న గ్రామదేవత జాతరకు వెళ్లిన దళిత యువకుడిపై కులదురంహాకారంతో దాడి చేయడం బాధాకరమన్నారు.

పెండింగ్ ఫైన్లపై ప్రత్యేక డ్రైవ్


ఎన్ఏడీ జంక్షన్ వద్ద ఆటోలను ఆపి పరిశీలిస్తున్న సీఐ మళ్ల అప్పారావు

గోపాలపట్నం: ఆటోలపై ఉన్న పెండింగ్ ఫైన్లు వసూలు చేసేందుకు ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఎన్ఏడీ జంక్షన్ దిగువ సర్కిల్ వద్ద ఆటోలను ఆపి ఎన్ని ఫైన్లు పెండింగ్ ఉన్నదీ.. అవి ఎంత అని పరిశీలించి వసూలు చేసే ప్రక్రియ చేపట్టారు. ఈ విధమైన తనిఖీలు ప్రతి రోజూ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఇంత వరకు ఈ ఫైన్లపై ఉదాసీనంగా ఉన్న పోలీసులు ఇప్పుడు ఉక్కు పాదం మోపారు. భారీ స్థాయిలో ఈ ఫైన్లు ఉంటాయని ఆటో డ్రైవర్లే చెబుతుండడం విశేషం.

పబ్లిక్ డిమాండ్

సైన్ బోర్డును తొలగించాలి


జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సైన్ బోర్డు


ప్రమాదకరంగా ఉన్న దిమ్మ

గోపాలపట్నం: జాతీయ రహదారిపై గతంలో నిర్మించిన సైన్‌బోర్డు ప్రమాదకరంగా మారింది. పట్టణాల పేర్లు, దూరాలను తెలిపేందుకు గతంలో దాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల ఈ రహదారిని విస్తరించారు. దీంతో సైన్‌బోర్డుకు చెందిన ఒక వైపు దిమ్మ రోడ్డు మధ్యగా వచ్చింది. ఇది ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. రాత్రి సమయంలో ఈ దిమ్మను ఢీకొట్టే ప్రమాదముందని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని తొలగించాలని అందరూ కోరుతున్నారు.

మరుగుకు తప్పని అవస్థలు


ఎన్ఏడీ జంక్షన్ అంబేద్కర్‌నగర్ వద్ద నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు


డ్రెడ్జింగ్ కార్పొరేషన్ నిర్మించిన మరుగుదొడ్లు

- ఎన్ఏడీ జంక్షన్‌లో ప్రయాణికుల ఇబ్బందులు
- కనీసం మహిళలకైనా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ ఇటీవల బాగా అభివృద్ధి చెందింది. రూ. 150 కోట్లతో ప్రత్యేక డిజైన్‌తో బ్రిడ్జి నిర్మాణం జరిగింది. అయితే ఇక్కడి ప్రయాణికులు, ప్రజల సౌకర్యాలను మాత్రం అధికారులు, నాయకులు విడిచి పెట్టేశారు. గతంలో ఎన్ఏడీ జంక్షన్ నాలుగు రోడ్లలో మూడు వైపులా మరుగుదొడ్లను స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా నిర్మించారు. అయితే ఇది మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. నిర్మాణమైతే చేశారు కానీ సరైన రీతిలో నిర్వహణ చేయకపోవడంతో అవి కాస్త మూలన పడ్డాయి. గాజువాక వైపు వెళ్లే రహదారిలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ సంస్థ నిర్మించిన కంటైనర్ మరుగుదొడ్లు మాత్రం కాస్త ఉపయోగకరంగా ఉన్నాయి. అయితే అవి కూడా ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇదిలా ఉంటే మరుగు దొడ్ల నుంచి వచ్చే మురుగు నీరు దిగువన ఉన్న గణేష్‌నగర్‌లోని ఇళ్లలోకి వెళ్తుండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం కల్పించాలని ఇక్కడి వారు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్టాప్ వద్ద..

అంబేద్కర్‌నగర్ వద్ద ఉన్న ఆర్టీసీ బస్టాప్‌కు సమీపంలో ఉన్న మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఇవి నిర్మాణం చేపట్టిన నాటి నుంచే ఈ పరిస్థితి నెలకొని ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ మరుగు దొడ్లను శుభ్రపరిచే వారు లేక ఈ పరిస్థితికి చేరుకున్నాయి. ఇప్పుడు కొత్తగా బస్టాప్ వద్ద మరుగుదొడ్లు నిర్మించాలని పలువురు కోరుతున్నారు. నిత్యం ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు బస్సుల కోసం వేచి ఉంటారు. వారు మరుగు కోసం అవస్థలు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. కనీసం పాత మరుగు దొడ్లనైనా బాగు చేసి అందుబాటులోకి తీసుకు రావాలని కోరుతున్నారు. అధికారులు ఈ సమస్యను పరిష్కరించే విధంగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

'కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి'

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తూ, కార్మిక వర్గాన్ని అణచివేసే కేంద్రప్రభుత్వ విధానాలను ప్రజలందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 770వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్ ప్లాంట్‌లోని సింటర్ ప్లాంట్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను నాశనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, ఈ ప్రయత్నాలను సంస్థలోని కార్మికులతో పాటు దేశంలోని ప్రజలందరూ ఐక్యంగా ఉండి ఎదుర్కోవాలని కోరారు. దేశంలోని సంపదను ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టే హక్కు కేంద్రానికి లేదన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు.